## సర్వేలో వివరాలు నమోదు చేయించుకోండి

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 16: మున్సిపాలిటీలో నివసిస్తూ సర్వేలో కుటుంబ వివరాలు నమోదుచేసుకోవాలని కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మిగిలిపోయిన వారు ఈ నెల 28వ తేదీవరకు సామాజిక, ఆర్థిక, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేలో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రజాపాలన పథకాల దరఖాస్తు కోసం టోల్‌ఫ్రీ 40 21111111కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లేదా http//seeepcsurvey.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని ప్రజాపాలన సేవా కేంద్రంలో, నేరుగా మున్సిపల్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

# నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

- కందుకూరులో వృథాగా లక్షలు పెట్టి నిర్మించిన షెడ్డు
- నేటికీ రోడ్డుపైనే అమ్మకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

కందుకూరు, ఫిబ్రవరి 16 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కందుకూరు మండల కేంద్రంలో రూ. 29 లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ షెడ్డు నిరుపయోగంగా ఉంటున్నది. దీంతో ప్రజాధనం వృథా అవుతున్నదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతంలో మండలంలోని రైతులు, వ్యాపారులు కూరగాయలు, పండ్లను రోడ్లపైన విక్రయించేవారు. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూ వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవాల్సి వస్తున్నదని, షెడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ప్రయోజనం కన్పించలేదు. అనంతరం విషయాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి రూ. 29 లక్షలను మంజూరు చేశారు. దాంతో మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ పక్కనే కూరగాయల షెడ్డు నిర్మించారు. అయితే మార్కెట్ షెడ్డును మాజీ మంత్రి ప్రారంభించి ఇప్పటికీ 9 నెలలు కావస్తున్నా నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ఫలితంగా మార్కెట్ షెడ్డు నిరుపయోగంగా ఉండి కుక్కలు, పందులు, కోతులకు నిలయంగా మారింది. మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మార్కెట్లో కూరగాయలు విక్రయించడానికి సరైన వసతులు కల్పించి తక్షణమే మార్కెట్ షెడ్డులో విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కందుకూరులో నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్ షెడ్డు

### మార్కెట్‌ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలి



కందుకూరులో కూరగాయల మార్కెట్‌ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలి. విక్రయదారులు నేటికీ రోడ్డుపైనే కూరగాయలను అమ్ముతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులు, వ్యాపారులు కూరగాయలను రోడ్ల పైన విక్రయించకుండా మార్కెట్ షెడ్డులో విక్రయించేలా చర్యలు తీసుకోవాలి.

– కాకి దశరథ ముదిరాజ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు

### రోడ్డుపై విక్రయించకుండా చర్యలు తీసుకోవాలి



వ్యాపారులు, రైతులు కూరగాయలు, పండ్లను రోడ్డుపై విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై విక్రయాలు నిలిపివేయాలి. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కృషితో ఇక్కడ మార్కెట్ షెడ్డు ఏర్పాటు చేశారు. అధికారులు షెడ్డులో వసతులు కల్పించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి.

– సామ ప్రకాశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

# విరబూసిన మామిడి పూత

**పొగమంచుతో మసిబారి రాలిపోతున్న వైనం**

**సస్యరక్షణ చర్యలు తీసుకోవాలంటున్న ఉద్యానవన శాఖ అధికారులు**



కేశంపేట, ఫిబ్రవరి 16 : ఎండాకాలంలో మామిడి పండ్లకు గిరాకీ అధికంగా ఉండడంతో మండలంలోని చాలామంది రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. దీని సాగుకు తక్కువ మొత్తంలో నీరు అవసరం అవుతుంది. మండలంలో 652 మంది రైతులు 2,489 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం మామిడి చెట్లకు విపరీతంగా పూత పూసినా పొగమంచు కారణంగా పూత రాలిపోతున్నది. పూత రాలిపోకుండా ఉండేందుకు హార్టికల్చర్ అధికారులు రైతులకు పలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

### పూత రాలుతున్నది..



ఉదయం వేళ కురుస్తున్న పొగ మంచుతో పూత రాలుతున్నది. మొదట్లో పూత, పిందెలు బాగానే పడుతున్నా కోత దశకు వచ్చే సరికి నష్టాలు చవిస్తున్నాం. ప్రస్తుతం మధ్యాహ్నం వేళల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, రాత్రి, ఉదయం సమయాల్లో పొగ మంచు కురుస్తుండడంతో పూత నల్లగా మారుతున్నది.

– రవి, మామిడి రైతు, లేమామిడి

### మందులు పిచికారీ చేయాలి..



మామిడిని సాగు చేసిన రైతులు పూత, పిందెలు రాలకుండా ఉండేందుకు ఫలదీకరణ దశలో ప్లానోఫిక్స్ ఒక మిల్లీలీటరుకు 4.5 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి. తేనె, పొగ మంచు, పురుగుల బెడద నుంచి కాపాడేందుకు వేపనూనె 5మిల్లీలీటర్లకు ఒక లీటర్ నీటిని కలిపి చల్లాలి. పెరుగుతున్న ఉష్ణోగ్రత నుంచి కాపాడేందుకు మూడు గ్రాముల వెట్టబుల్ సల్ఫర్ ఒక లీటరు నీటికి లేదా హెక్సాకోనజోల్ ఒక మిల్లీలీటరును లీటరు నీటికి కలిపి జల్లుల రూపంలో చల్లాలి.

– హిమబిందు, ఉద్యానవన శాఖ అధికారిణి, షాద్‌నగర్



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే

కొందుర్గు, ఫిబ్రవరి 16: మండలంలోని ఉత్తరాసిపల్లి గ్రామంలో ఆదివారం క్రికెట్ టోర్నీని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత పట్టుదల, అంకితభావంతో క్రీడల్లో రాణించాలన్నారు. ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, గెలుపుకు పొంగిపోకుండా ఓటమికి కుంగిపోకుండా ముందుకు సాగాలన్నారు. స్నేహపూరిత వాతావరణలో క్రీడల్లో రాణించాలని, నిత్యం కఠోర సాధన చేసి క్రీడల్లో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, అంజిరెడ్డి, జితేందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, రాంచంద్రయ్య, అంజయ్య, అశోక్ పాల్గొన్నారు.



నూతన దంపతులతో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

కేశంపేట, ఫిబ్రవరి 16: కొత్తపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు భిక్షపతియాదవ్ కుమారుడు మహేశ్‌యాదవ్ నిఖిత వివాహం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలోని బీఆర్‌ఎస్ గార్డెన్‌లో శనివారం జరిగింది. ఈ వివాహ వేడుకల్లో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పాల్గొని దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జగన్‌రెడ్డి, జమాల్‌ఖాన్, కుంటి లక్ష్మయ్య, రమేశ్, వెంకన్నయాదవ్, శ్రీనివాస్, ఖాజాపాష పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 16: 1955–2005 సంవత్సరాల మధ్య చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం చేవెళ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ (ప్రభుత్వ) ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పదో తరగతిలో చదువుకున్న అందరూ ఒకే వేదికపై కలుసుకునేలా కృషి చేసిన పూర్వవిద్యార్థులును అభినందించారు. జీవితంలో మరింత అభివృద్ధి చెందాలని ఉపాధ్యాయులు పూర్వవిద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు తదితరులు ఉన్నారు.



## తోటి స్నేహితుడికి చేయూత

మంచాల, ఫిబ్రవరి 16: మంచాల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 1988–89 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడైన పి.రమేష్ అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడన్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులైన, తోటి స్నేహితులందరూ రమేష్‌కు ఆర్థిక సాయం చేయాలనే సంకల్పంతో ఆదివారం రమేశ్ ఇంటికి వెళ్లి అతడి యోగక్షేమాలు తెలుసుకొని రూ.35వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. రమేశ్ కుటుంబానికి ఎల్లవేళలా తాము అండగా ఉంటామని అతడికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాదగిరి, రాజు, కృష్ణ, శ్రీనివాస్‌చారి, మణెమ్మ, అనిత, విట్టల్‌రెడ్డి, యునుస్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావంతోనే సమాజంలో మార్పు



కేశంపేట, ఫిబ్రవరి 16: మానవుడు సామాజిక సేవా భావాన్ని కలిగి ఉన్నప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ అర్చకుడు బోద రంగయ్య అన్నారు. కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన దన్నె మహేశ్ రూ.56వేల విలువైన సౌండ్ బాక్సులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లేశ్, హంసమ్మ, బోద లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దీవెన మహోత్సవం



విద్యార్థులను ఆశీర్వదించిన తల్లిదండ్రులు, అసోసియేషన్ ప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 16: ప్రతి ఇంటా విద్యార్థులు.. వచ్చేది పరీక్ష కాలం.. ఏడాది చదివినదంతా పరీక్ష ఫలితాల్లో చూపించాల్సిన సమయం. ఎవరికైనా కొంచెం ఒత్తిడే. విద్యార్థులకు ఇది ఇంకొంచెం ఎక్కువే. అందుకే విద్యార్థి దశలో తాము భరించిన ఒత్తిడిని కొంచెమైనా తగ్గించాలని భావించారు మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం జీవీఆర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు. ఆదివారం విద్యార్థులందరితో గెట్ టు గెదర్ ఏర్పాటు చేశారు. విద్యార్థి దీవెన మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సరస్వతీ దేవి పూజలు చేసి తల్లిదండ్రులతోపాటు అసోసియేషన్ ప్రతినిధులు విద్యార్థులందరినీ దీవించారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా అధిగమించాలో వివరించారు. తమ విద్యార్థి దశలో ఎలాంటి ఒత్తిడి ఉండేది, ఎలా అధిగమించి ఉన్నత స్థాయికి వెళ్లారో ఉదాహరణలో తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షురాలు సుజాత, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ రాజనర్సు, కాలనీ ప్రతినిధులు విశ్వనాథం, ఎస్‌ఆర్‌కే ప్రసాద్, ప్రశాంత్‌కుమార్, రామ్మోహన్, వేణుగోపాల్, శోభ, శ్యామల, ప్రసన్న, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. గోల్డెన్ మ్యాక్ సొసైటీ ప్రతినిధి ఎం శ్రీనివాస్ విద్యార్థులకు స్టేషనరీ వస్తువులు అందజేశారు.

## నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 16: షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో సోమవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి నెలా ఈ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా డయల్ యువర్ డీఎం ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. డయల్ యువర్ డీఎం 9959226287 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కాలం చెల్లిన సోడ విక్రయం

**ప్రశ్నించిన వినియోగదారుడిపై దాడికి యత్నం**

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 16 : కాలం చెల్లిన సోడలు అమ్ముతుండగా.. ఇదేంటని ప్రశ్నించిన వినియోగదారుడిపై దాడికి యత్నంచారు. ఈ సంఘటన ఆదివారం శంషాబాద్ మండలం పెద్దషాపూర్ తండా గ్రామ పరిధిలో జరిగింది. వినియోగదారుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దషాపూర్‌తండా పరిధిలోని రోడ్డు చౌరస్తా వద్ద ఉన్న దుకాణానికి ఆదివారం ఓ వ్యక్తి వెళ్లి సోడా కావాలని కోరగా..కాలం చెల్లిన సోడ అందించాడు. దాన్ని చూడకుండా సదరు వ్యక్తి తాగేశాడు. ఆ తర్వాత సీసాపై ఉన్న తేదీ చూడగా ఈ నెల 4 వరకు మాత్రమే ఉంది. ఇదేమిటని హోటల్ నిర్వాహకుడిని ప్రశ్నిస్తే ఇలాగే ఉంటాయి... నువ్వు ముందు డబ్బులు చెల్లించు.. లేకపోతే ఇక్కడి నుంచి ఎలా వెళ్తావో చూస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. బాధితుడు విషయాన్ని మీడియాకు తెలియజేయగా.. అక్కడికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై సైతం నా వద్ద ఇలాగే ఉంటాయి... ఇది ఒక్కటే కాదు ..నా దగ్గర చాలా ఉన్నాయి... మీ ఇష్టం ఉంటే తాగండి.. లేకపోతే మీ ఇష్టం అంటూ బెదిరింపులకు దిగాడు..దీంతో బాధితుడు దుకాణ నిర్వాహకుడిపై వినియోగదారుల కోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు.

# నిబంధనలు పట్టని డ్రైవింగ్ స్కూల్స్..!




శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 16: శంషాబాద్ పరిధిలో కొందరు డ్రైవింగ్ స్కూల్స్ నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. ఆర్టీఏ అధికారుల అనుమతిలేకుండానే శిక్షణ ఇస్తున్నారు. కనీసం నిబంధనలు కూడా పాటించడంలేదు. వారు వినియోగిస్తున్న వాహనాలను ఆర్టీఏ అధికారులు తనిఖీలు కూడా చేయడం లేదు. దీంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రవాణాశాఖ నుంచి ఒక వాహనానికి అనుమతి తీసుకుని.. అదే వాహనం పర్మిషన్ మీద పదుల సంఖ్యలో వాహనాలు నడుపున్నారు. శిక్షణ కేంద్రాల నిర్వాహకులు మొదట పది రోజులపాటు సిమ్లేటర్‌పై నేర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలి... ఇలా కాకుండా నేరుగా కారు ఎక్కించుకుని తక్కువ సమయంలో ఎక్కువ మందికి శిక్షణ ఇస్తున్నారు. కరోనా తర్వాత ప్రైవేట్ వాహనాల వినియోగం అధికమైంది. కార్ల అమ్మకాలు అధికంగా పెరగడంతో ఆడ, మగ తేడా లేకుండా డ్రైవింగ్ నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ఇష్టాన్ని ఆసరాగా చేసుకుని శిక్షణ కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా ఫీజులు తీసుకుంటూ.. పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వకుండానే, రోడ్డు భద్రత సూచికలపై అవగాహన కల్పించకుండానే లైసెన్సులు ఇప్పిస్తున్నారు. ఈ కారణంగా రోడ్డుపై ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యం లో కీలకమైన డ్రైవింగ్ శిక్షణపై పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉంది. అనుమతి లేని డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ ఇస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కాగా.. అనుమతిలేని డ్రైవింగ్ స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేస్తే మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు బాధితులు తెలిపారు.

# గిరిజన హాస్టళ్లలో వసతులు కరువు..




విద్యార్థులతో తెలంగాణ స్టూడెంట్ సామాజిక ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లక్ష్మీనివాస్

**తెలంగాణ స్టూడెంట్ సామాజిక ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లక్ష్మీనివాస్**

బండ్లగూడ, ఫిబ్రవరి 16 : తెలంగాణ రాష్ట్రంలో గిరిజన హాస్టళ్లను ప్రభుత్వం గాలికి వదిలేసిందని తెలంగాణ స్టూడెంట్ సామాజిక ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లక్ష్మీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమకు నాణ్యమైన భోజనం అందడం లేదని వివరించారు, వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నట్లు వివరించారు. అనంతరం లక్ష్మీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందకపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని అన్నారు. తద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి.. విద్యాబుద్ధులు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌ఓ నాయకులు రఘు ముదిరాజ్ సుధాకర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు

## భూబాధితులకు న్యాయం చేయాలి



దీక్షలో పాల్గొన్న భూ బాధితులు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 16 : శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ తండా శివారులోని లంబాడ గిరిజన ప్రజలు తమకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాఖల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 37వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలో పాల్గొన్న భూబాధితులు మాట్లాడుతూ.. తమ భూములను అక్రమంగా తీసుకున్న పలు రియల్ ఎస్టేట్ కంపెనీల యజమానులపై చర్యలకు ప్రభుత్వం సహకరించాలన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మాకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పి.లక్ష్మణ్, రవి, శంకర్, బాబు, లక్ష్మణ్, చందర్, రెడ్డి, గోపి, సోనిబాయి, తులసి, గోమా, మున్న, శంకరమ్మ, మాణెమ్మ, పి.కవిత, బీఆర్‌ఎస్ నాయకుడు రాజు, తండా వాసులు పాల్గొన్నారు.


**కుల గణనలో పాల్గొనని వారికి మరో అవకాశం**

# ఈ నెల 28 వరకు సర్వే

- ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ

మలక్ పేట, ఫిబ్రవరి 16: కుల గణనలో పేరు నమోదు చేసుకోని వారి కోసం జీహెచ్‌ఎంసీ ప్రత్యేక కాల్ సెంటర్(040–2111 1111)ను ఏర్పాటు చేసిందని సౌత్ జోన్ సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 28 వరకు మరోసారి సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కులగణనలో నమోదు కాని వారి కుటుంబసభ్యులు మాత్రమే పైన తెలిపిన నంబర్‌కు కాల్ చేసి వివరాలు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ తదితర వివరాలు తెలియజేయాలని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కాల్‌సెంటర్ పని చేస్తుందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రజలతో పాటు వివిధ జిల్లాల కాల్స్‌ను కూడా స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. కాల్ చేసే వ్యక్తి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో అయితే గ్రామం వీధి నెంబర్, పిన్‌కోడ్, అడ్రస్ తదితర వివరాలు వెల్లడించాలని, పట్టణాల్లో అయితే సర్కిల్, వార్డు నంబరు తెలియజేస్తే ఎన్యూమరేటర్లు వారి ఇంటికి వచ్చి సర్వే వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని డీసీ జయంత్ సూచించారు.

## యువకుల క్రీడల పట్ల ఆసక్తి చూపాలి



అగర్ మియగూడలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఉప సర్పంచ్ రేవంత్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 16 : యువకులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని మండలంలోని అగర్ మియగూడ మాజీ ఉప సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం అగర్ మియగూడలో యువకులు ఏర్పాటుచేసిన క్రికెట్ ప్రీమియర్ లీగ్, సీజన్ 8ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో యువకులు భాగస్వాములు కావాలని కోరారు.

కార్యక్రమంలో గోసుల కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, షేక్ మున్నా, రవీందర్ ముదిరాజ్, ప్రశాంత్, అంజిరెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథలకు వివాహాలు

సైదాబాద్/ఆర్కేపురం, ఫిబ్రవరి 16: రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైదాబాద్ ఎస్‌బీహెచ్ జీఏ–2 కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఇద్దరు అనాథలకు వివాహాలు జరిపించారు. ఫౌండేషన్ నిర్వాహకులు నాగమల్ల అనిల్‌కుమార్ గుప్తా, అరుణ దంపతులు నూతన వధూవరులు శృతి–శివకుమార్, నవనీత–ప్రవీణ్‌కు శాస్త్రోక్తంగా హైందవ ధర్మం ప్రకారం వివాహ వేడుకలు జరిపించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ గుప్తా మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరింత మంది అనాథలకు పెళ్లిళ్లు జరిపిస్తామన్నారు. ఈ వేడుకల్లో బద్దం ప్రేమ మహేశ్వర్‌రెడ్డి, జగనీ శ్రీనివాస్, శరత్‌కుమార్ కృష్ణకుమారి, రామ్ సేవా ట్రస్టు అధ్యక్షుడు కొంచెం నరసింహారావు, కొండా సురేశ్‌కుమార్, నీలా వెంకటేశ్, అనిల్ కుమార్ అరుణ దంపతులు పాల్గొన్నారు.





నూతన వధూవరులకు వివాహాలు జరిపిస్తున్న నాగమల్లి అనిల్‌కుమార్, అరుణ దంపతులు